# నిజం – నీడలు

లేజవ్వానుల నీలవేణులలో నిలవాలని కొన్ని, పరమేశ్వరుడి పాదాలమీద వాడిపోవాలని కొన్ని, ఏ రాజకీయ దురంధరుడి మెళ్ళోనో దండై గౌరవం సంపాదించాలని కొన్ని .... ...

పూలవాడు చల్లే చల్లని నీళ్ళతో పోయే జీవాలకు కలల కళ్ళేలు వేస్తూ, ఫుట్‌పాత్‌మీది రక రకాల పువ్వులు రకరకాల ఆలోచనల్తో మునిగి సాలోచనగా ట్రాఫిక్‌ని చూస్తున్నాయ్ .... ....

మళ్ళీ నీళ్ళు చల్లాడు పూలవాడు.

చుట్టూ చూశాడు పరిసరాలు.

వాహనాలు నోర్లు మొత్తుకుంటున్నాయ్, బ్రిడ్జి మీద పోలీసు అఫ్జల్‌గంజ్ సెంటర్‌కు విడాకులిచ్చి, దూరంగా చెట్టు క్రింద సిగరెట్‌ను చేపట్టాడు. వచ్చిన బస్సులు వాగరుస్తూ విశ్రాంతి తీసుకుంటున్నాయి. ఎదురుగా కేఫ్‌లో నుంచి సర్వర్ కుర్రాడి గొంతులో జీరలు, పాపం! ఉదయం నించి "చాయ్" అంటూ అరిచాడు పూలవాడి కళ్ళలో - దూరంలో నడచి వెళుతున్న జంట; ప్రతిబింబం.

ఆ ప్రతిబింబం వాడి "మతి"లో యిరుక్కున్న సంఘటనను పెళ్ళ గించింది. ఆలోచనతో చిందర వందరగా గందర గోళంగా .... .... మనసు

"నిన్న సాయంత్రం నయాపూల్ ప్రాంతం, తలనిండా పూలు పెట్టుకున్నట్లు, ఉన్నట్లుండి చిరునవ్వు వాలికినట్లుగా వున్నప్పుడు - ఆసుపత్రి వైపు నుండి ఆరుగంటలు వినబడి, సూర్యుడు టైమయిపోయిందని, చంద్రుడికి ఛార్జి ఇవ్వడానికి వెళ్ళిపోయినాక.

ఆ జంట .... .... । తనవైపే వచ్చింది.

కళ్ళు తెరిచే వళ్ళు మరచి వచ్చింది.

ఆమె ఎంత అందంగా వుంది?

చక్కని శరీరపు వంపులు .... .... ।!

వాళ్ళు అన్యోన్యతకు మారుపేర్లు.

ఏ దేవుడూ వాళ్ళ అన్యోన్యతను విడదీయలేడు .... .... అక్కడ అంత మంది జనం ఉన్నా .... వాళ్ళిద్దరు ఒకరి .... ....

ముందు ఎన్ని పూలున్నా, తనకు మల్లెపూలే కావాలని పించినట్లు నడచి వచ్చింది .... ।

ఎన్ని జంటలను చూసినా ఈ జంటనే చూడాలనిపించింది. హృదయంలో నిలుపుకోవాలనిపించింది పూలవాడికి !

పూలు కొనుక్కున్న ఆ జంట। అక్కడి చెట్ల నీడల వెంటసాగి, ఎవరు చూడని ఆ చివర్లో ఆగింది.

అత డామె జడలో పెడుతున్నాడు పూలు.

ఆ వైపు చూస్తే బాగుండదని మనసు నొక్కి చెప్పినా వాడి కళ్ళు మాత్రం ఆవైపే చూస్తూ ఉండిపోయాయి !

తాను అమ్మే మల్లెపూలు అంత పవిత్రమైన ప్రేమ కార్యం కోసం వినియోగమవుతున్నందుకు అతను పొంగిపోయాడు.

ఎదురుగా కేఫ్‌లోని గడియారంలో ఒకేముల్లు కనిపించింది.

"కైసాదేరై" అన్న పదంతో వాడు మళ్ళీ ఈ లోకానికి వచ్చాడు:

ఆ ప్రశ్నించి నాయనికు జవాబు చెప్పి మళ్ళీ పూలవైపు గమ్మత్తుగా చూశాడు.

పూలమీద నీళ్ళు జల్లాడు.

సాయంత్రం అవుతున్నా భరింపలేని ఎండ. దూరంగా ఫుట్‌పాత్‌మీద వంటినిండా చింపిరిగుడ్డల్తో కుంటిది ఎండ భరింపలేని చంటిది ఏడుస్తున్నప్పుడు చిరిగిన కొంగు కప్పింది.

పూలవాడి మెదడులో ఏదో మలుపు.

అకస్మాత్తుగా ఏదో మత్తులో అప్పటివరకు తనకు చలువనిస్తున్న గొడుగును పూలకు నీడగా జరిపాడు!

పూలు సూర్యుడి కిరణాల వాడిని తట్టుకున్నాయి - పూలవాడు, ఎండలోనే ఉండిపోయాడు.

"పూలు తన ఆకలి మాపుతాయని మాత్రం తెలుసు ఆ పూలు ఎందరిలోనో ఎన్నో ఆకళ్లు రేపుతాయని తెలియదు!"

తన దగ్గర ఉన్నంతసేపు రక్షించడమే తన విధి అనుకున్నాడింత వరకు —

వాసనల్ని చూసేవాళ్ళ మనసుల్లో చెరగని ముద్రలు — ప్రియురాలి ముద్దుల్లాగ చెదిరిపోవని ఇప్పుడే తెలుసు!

పూల వాసనల్లోనే మమత, సమత, పవిత్రత, ప్రేమ. జాలి, నిబడీకృత మైనాయన్న ఆలోచన తలుపు తట్టగా, మతిద్వారాలు బార్లా తెరచి ఆహ్వానించాయి.

అందుకే — అసలు గొడుగు జరిపాడు.

ప్రక్కనే కుంటిదాని కొంగునీడలో తల్లి చేతిలోని లోటా లోంచి చంటిది గటగటా నీళ్ళు గతుకుతున్నది, రేపు అది ఎంత కి సంతోషాలు పంచాల్సి ఉందో? ఎవరికి తెలుసు?

పూలు గొడుగు నీడల్లో పడుకున్నాయి !!

ఆరోజునించి ప్రతిరోజు ప్రతి పువ్వును తన ప్రాణంగా చూసుకుంటున్నాడు.

పూర్తి ఎండను భరించి పూలకు నీడను అందిస్తూ — ఆనందిస్తున్నాడు పూలవాడు, ఉన్నట్టుండి ఒకనాడు వర్షం .... .... !!

ఆకాశంనించీ భూమికి వర్షధారలు స్తంభాలు కట్టాయి. ఉరుములు — మెరుపులు — అనుపల్లి గడియారం, మెరుపులో తొమ్మిది అని గడమాయించి చూపించినట్లయింది.

హోరుగాలి నోరుతెరిచి పూలవాడి దీపాన్ని ఆర్పేసింది.

అప్పటికే చినుకుల దెబ్బలకు పూలు భయపడి ఫుట్‌పాత్ మీంచి జారి నీళ్ళచే లాగబడుతూ ఎక్కడయినా, దేనికయినాసరే తట్టుకుని నిలబడదామని ప్రయత్నిస్తూ వెళుతున్నాయి.

సహాయం కొరకు చేసే ఆక్రందన - బిడ్డలు నీటిలో మునిగిపోతూ, చేయి చాపుతూ తండ్రి కొరకై పిలిచే పిలుపు లాటింది.

మిగిలినవి బుట్టలోకెత్తి, కొంచెం దూరంలో కిళ్ళీడబ్బా క్రింద భద్రపరిచి, గొడుగు తెరచి దగ్గరి దారిగుండా ఇంటికై అడుగులు వేస్తున్నపుడు, కుంటిది తాను నానుతున్నా చంటిదానికి జల్లుపడకుండా కప్పి ఎదురుగా ఉన్న "కేఫ్" మెట్లమీద మూల నక్కింది —

చీకటిగా ఉంది —

ఎన్నో రోడ్ల చివరలుదాటి వాడు మరో గల్లీలో అడుగుపెట్టాడు.

ఆ గల్లి చివర్లో ఉన్న బంగళా చాలా పెద్దది.

అందులో రోజంతా నిశ్శబ్దంగా వుంటుంది.

రాత్రంతా లైట్లు వెలుగుతాయ్ !!

పెద్ద పెద్దకార్లు ఆగి వెళుతుంటాయ్,

అది అందరికీ తెలుసు - కాని తెలియనట్టే వుంటారు.

అదేమిటో ఎవ్వరికీ తెలియదు! కాని తెలిసినట్టే ఉంటాదు. ఆ భవనమే పెద్ద గ్రంథాలయం. పొట్టవిప్పితే అన్నీ అభినవ మహాభారతాలు, రామాయణాలే పెళతాయ్. అందులో పుస్తైలేని పుస్తకాలు జారిపోతున్న యౌవ్వనానికి ప్రతిక్షణం బిగువుగా బైండింగ్ జరుగుతుంటుంది.

చదవని కొత్తదేదిలేదు! అన్నీ చదివినవే, అయినా చదివేసిన వాటినే పిచ్చిగా కళ్ళు మూసుకుని చదివి వెళ్తారు !!

అంతా పోగొట్టుకుని ఏదో లభించినట్లు — వెళ్తారు.

పూలవాడికి. ఆ బజారన్నా, బంగళా అన్నా దేవుడి పాదాలెంత ఇష్టమో అంత ....

తలుచుకుంటే గుండెమీద జెర్రులు పాకుతున్నట్లుంది.

ఒక్కసారి మెరుపు! :

ఏదో నిజాన్ని తెలుపుతా నన్నట్లు—

ఆ వెలుగులో వాడికళ్ళకు మళ్లీ అదే సీను! ఆమె తలలో అతను పూలు పెట్టడం!

ఆమె తను ఇంతకు కొద్దిరోజుల క్రితం చూసిన స్త్రీ!

కాని ఆ పూలు పెడుతున్నది ఆనాడు చూసిన ఆయనకాదు! ఎవరో ఇంకో వ్యక్తి - ఆమె నవ్వులు — వాడు ఆమెను బలవంతంగా తన బాహువుల్లోకి లాక్కోవడం - ఒక్కసారిగా కనిపించాయి.

రొడ్డుమీద చెత్తా, చెదారం, పాత తాళ్ళు కొట్టుకుపోతున్నాయి.

తనకడుపులో పేగులు, చుట్టుకుపోతున్నాయి.

కసీ ద్వేషం, బొట్లుబొట్లుగా - బిగబట్టిన ఊపిరిలోంచి జనించి, గుండెలోకి జారుతోంది.

ఒక్కసారిగా ఎవరో తరుముతున్నట్లు ఇంటిదాకా పరుగెత్తాడు ....

తన దగ్గరున్న పూలుఅన్నీ పవిత్రతకే అంకితం కావాలనుకోవడం - అసలు చీకటి రాకుండా వెలుగే ఉండాలనుకోవడం లాంటిది

సూర్యుడు వచ్చి చాలా సేపయింది - రోడ్డుమీది మనుషులు చమటల్లో స్నానాలు చేస్తున్నారు. పూలపై నీళ్ళు చల్లుదామనుకున్నాడు ఎందుకో చేతులు రాలేదు.

చల్లకుండే చచ్చిపోతాయి పూలు. శవాల్ని ఎవరు కొంటారు?

తన కడుపుకీ ఉంటుంది ఆకలి.

అయినా చల్లలేదు నీళ్ళు!!

ప్రక్కనే కుంటిదాని బాపతు చంటిది. త్రాగేసిన ఎంగిలిబీడి నోట్లో పెట్టుకుని చప్పరిస్తోంది !

బిచ్చపు కుంటిదానికి చెప్పలేని రోషం!

లాగి చెంపదెబ్బ కొట్టింది!!

పూలమీద అంతవరకూ నీడగావున్న గొడుగును లాగి తనవైపు లాక్కున్నాడు,

అంతవరకు గొడుగు నీడలోవున్న పూలు నవ్వుకున్నాయి.

—కాని వాటికితోడు "నిజం తాలూకు నీడలు" కూడా కనిపించాయి!!

పూలవాడు ఎన్నడూ పూలపై గొడుగు తిప్పలేదు!!

1971